సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 14 । నవంబర్ । 2023



టమాట కిలో రూ.28

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

చిన్నారి లక్షిత (5) కిడ్నాప్ కథ సుఖాంతమైంది. చాక్లెట్లు, బాణాసంచా కొనిస్తానని ఆశజూపి బాలికను ఎత్తుకెళ్లిన దుండగుడు పోలీసులకు భయపడి పట్టణంలోనే వదిలివెళ్లాడు. 8లో

గరిష్టం/కనిష్టం
33.2°/ 15.6°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేకువజామున చలితో పాటు మంచు కురుస్తోంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ఆలయ సిల్క్స్' యజమానికి రిమాండ్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: చేనేత వ్యాపారుల వద్ద చీరలు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన కేసులో విజయవాడ 'ఆలయ సిల్క్స్' యజమాని అవినాష్‌గుప్తాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడారు. 'ఆలయ సిల్క్స్' యజమాని అవినాష్‌గుప్తా ధర్మవరంలోని పలువురు వ్యాపారుల నుంచి పట్టుచీరలు కొనుగోలు చేశాడు. డబ్బులు ఇవ్వకుండా రేపు, మాపు అంటూ తప్పించుకున్నాడు. గట్టిగా నిలదీసిన వారిని భయపెట్టాడు. ఈక్రమంలోనే మూడు నెలల క్రితం విజయవాడకు వెళ్లి డబ్బులు అడిగిన వ్యాపారులపై దాడు చేయడమే కాకుండా ఆ వీడియోలను ధర్మవరం పట్టుచీరల వ్యాపారులకు పంపించారు. దీనిపై వ్యాపారులు ఫిర్యాదు చేయగా, విజయవాడ పటమట పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే 23 మంది వ్యాపారులు ధర్మవరంలో కూడా అవినాష్‌గుప్తాపై ఫిర్యాదు చేయగా, ఇప్పటికే ఐదు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి శనివారం అవినాష్‌గుప్తాను విజయవాడలో అరెస్టు చేసి తీసుకువచ్చామని, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

జేఎన్‌టీయూ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పదవీ కాలం 2024 జనవరి 13న ముగియనుంది. నూతన వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు నియమించారు. కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ ముగ్గురు వైస్ చాన్సలర్ (వీసీ) పదవి కోసం ముగ్గురు పేర్లు ప్రతిపాదిస్తారు. ఇందులో ఒకరిని వీసీగా చాన్సలర్/ గవర్నర్ నియమిస్తారు. సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నామినీగా ప్రొఫెసర్ బీలా సత్యనారాయణ (పూర్వ వీసీ, ఆంధ్రా యూనివర్సిటీ), వర్సిటీ పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డి (పూర్వ వీసీ, వీటీయూ, కర్ణాటక), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ కృష్ణపాల్ సింగ్ (మహాత్మా జ్యోతిరావు పూలే వర్సిటీ, రోహిల్ ఖండ్, బారెల్లి, ఉత్తరప్రదేశ్)లను ఉన్నారు. త్వరలోనే సెర్చ్ కమిటీ సమావేశమై.. దరఖాస్తులన్నింటినీ పరిశీలించి మూడు పేర్లను ప్రతిపాదించనుంది.



బాణాసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దంపతులు





ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద దీప కాంతులు, వీరభద్రస్వామి దేవాలయం వద్ద వెలుగుతున్న దీపాలు



విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న లేపాక్షి నంది విగ్రహం

వెలుగుల హరివిల్లు

పుట్టపర్తి టౌన్: జీవితాల్లో చీకటిని తొలగించి వెలుగులు నింపే దీపావళి పర్వదినాన్ని జిల్లా వాసులు సంతోషంగా జరుపుకున్నారు. ప్రతి ఇల్లూ పటాసుల మోతతో హోరెత్తింది. చిచ్చుబుడ్ల వెలుగులు వాడవాడలా పరుచుకున్నాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా బాణాసంచాను పేలుస్తూ ఆనందసాగరంలో మునిగితేలారు. అలాగే ఇళ్లు, దుకాణాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తన స్వగృహం నల్లసింగయ్యగారిపల్లిలో కుటుంబసభ్యులతో కలసి దీపావళి పండుగను జరుపుకున్నారు. పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయంతో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నంది విగ్రహాన్ని దీపాలతో అందంగా అలంకరించారు. ప్రశాంతి నిలయంలోనూ దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, సత్యసాయి ట్రస్ట్ ఉద్యోగులు, భక్తులు బాణాసంచా కాలుస్తూ దీపావళి వేడుకలు జరుపుకున్నారు.



యజుర్ మందిరం వద్ద సత్యసాయి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, భక్తులు, విద్యార్థులు

రైతుకు 'పట్టు' చిక్కింది

పట్టు రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహానికి తోడు మార్కెట్‌లో పట్టుగూళ్లకు ఆశించిన ధరలు లభిస్తుండటంతో జిల్లాలో ఏటికేడు మల్బరీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కొత్తగా 10వేలకు పైగా ఎకరాల్లో మల్బరీ సాగులోకి రాగా శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

- మల్బరీ సాగులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా
- ఏటా పెరుగుతున్న మల్బరీ సాగు విస్తీర్ణం
- సిల్క్ సమగ్ర పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ
- ఆర్థికంగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



మడకశిర సమీపంలో మల్బరీ తోట



హిందూపురం మార్కెట్‌కు వచ్చిన పట్టు గూళ్లు

సిల్క్ సమగ్ర పథకం-2లో భాగంగా యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీ ఇలా...

యాక్టివిటీ ఎస్సీ, ఎస్టీలకు	యూనిట్ విలువ (రూ.లక్షల్లో)	కేంద్రం వాటా (రూ.లక్షల్లో)	రాష్ట్రం వాటా (రూ.లక్షల్లో)
మల్బరీ ప్లాంటేషన్	25,000	16,250	6,250
షెడ్ నిర్మాణం	4,00,000	2,60,000	1,00,000
పరికరాలు	75,000	48,500	18,650
ఓసీ, బీసీ, ఇతరులకు			
మల్బరీ ప్లాంటేషన్	25,000	12,500	6,250
షెడ్ నిర్మాణం	4,00,000	2,00,000	1,00,000
పరికరాలు	75,000	37,500	18,750
క్రిమి సంహార మందుకు	5,000	2,500	1,250

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ఇలా..

యాక్టివిటీ	యూనిట్ విలువ	ఆర్‌కేవైసీ	లబ్ధిదారు వాటా
కూలింగ్ సిస్టం	రూ.25,000	రూ.22,500	రూ.2,500
ప్లాస్టిక్ చంద్రికలు	రూ.15,000	రూ.13,500	రూ.1,500
ఫారంపాండ్	రూ.1,50,000	రూ.1,35,500	రూ.5,000
సోలార్ షెడ్	రూ.50,000	రూ.45,000	రూ.5,000
ఫామ్ ఏర్పాటు	రూ.1,00,000	రూ.90,000	రూ.10,000

హిందూపురం అర్బన్ : 'పట్టు'... రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. ప్లాంటేషన్ మొదలు పంట విక్రయం దాకా రాయితీలిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో రైతులు కూడా సంప్రదాయ పంటల స్థానంలో మల్బరీ సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్ల కాలంలోనే జిల్లాలో కొత్తగా 10,481 ఎకరాల్లో మల్బరీ సాగులోకి వచ్చింది. ఫలితంగా 42 వేల ఎకరాలతో మల్బరీ సాగులో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఉత్పత్తయ్యే పట్టుగూళ్లు నాణ్యతలోనూ మొదటి స్థానంలో నిలవడంతో ధర కూడా ఆశించిన మేర దక్కుతోంది.

మరో నాలుగు వేల ఎకరాల్లో సాగు..

జిల్లా వాతావరణ పరిస్థితులు మల్బరీ సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమైంది. సచివాలయాల్లోనూ ప్రత్యేకంగా సెరికల్చర్ అసిస్టెంట్లను నియమించి సాగులో రైతులకు కావాల్సిన సలహాలు, సూచనలు ఇప్పిస్తోంది. ఈ ఏడాది కొత్తగా 4వేలకుపైగా ఎకరాల్లో మల్బరీ సాగులోకి తీసుకురావాలని సెరికల్చర్ అధికారులు లక్ష్యంగా విధించుకున్నారు. ఇందులో ఇప్పటికే 2,500 ఎకరాలు సాగులోకి రాగా.. వంద శాతం లక్ష్యం సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని మడకశిర, హిందూపురం అధిక విస్తార్ణంలో మల్బరీ సాగులో ఉంది. అలాగే కదిరి, ధర్మవరం ప్రాంతాల్లోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో మల్బరీ సాగవుతోంది.

లక్ష్య సాధనకు కృషి

శ్రీ సత్యసాయి జిల్లాలో మల్బరీ సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. నాలుగేళ్లలో 4,822 మంది రైతులు 10,481 ఎకరాల్లో మల్బరీ సాగు చేశారు. షెడ్, ఇతర సామగ్రికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తూ ఆర్థికంగా చేయూతనిస్తోంది. అందువల్లే రైతులు చాలా మంది మల్బరీ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది 3,550 ఎకరాల్లో మల్బరీ సాగులోకి రావాలని లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటికే 2,500 ఎకరాల్లో సాగులోకి వచ్చింది.

– పద్మమ్మ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్

ధరలు ఆశాజనకం



ప్రభుత్వ సహకారం బాగా ఉంది. అందువల్లే మల్బరీ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. హిందూపురం మార్కెట్‌లో ధరలు కూడా బాగా పలుకుతున్నాయి. అందుకే మార్కెట్‌కు భారీగా పట్టుగూళ్లు వస్తున్నాయి. సోమవారం మార్కెట్‌కు 8,028 కిలోల పట్టుగూళ్లు రాగా, కిలో గరిష్టం రూ.550, కనిష్ఠంగా రూ.316, సగటు రూ.447 మేర ధర పలికాయి.

– సురేష్‌కుమార్, ఏడీ సెరికల్చర్, హిందూపురం

'విద్యా దీవెన'కు జాయింట్ అకౌంట్ చేయించుకోవాలి



ప్రశాంతి నిలయం: జగనన్న విద్యా దీవెన పథకం కింద నాల్గో విడత లబ్ధి కోసం తల్లితో పాటు విద్యార్థులు తప్పనిసరిగా జాయింట్ బ్యాంకు అకౌంట్ చేయించుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 28న జగనన్న విద్యాదీవెన నాల్గో విడత నగదు జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందన్నారు. తల్లితో పాటు విద్యార్థులు కలసి ఈ నెల 24వ తేదీలోపు ఉమ్మడి బ్యాంక్ అకౌంట్ తెరవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, 2022–23 సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు జాయింట్ అకౌంట్ అవసరం లేదని వెల్లడించారు. తల్లితో పాటు విద్యార్థులను పథకంలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జాయింట్ అకౌంట్ వివరాలను సచివాలయాల్లో సమర్పించాలని సూచించారు.

పాటించాల్సిన నిబంధనలు..

- ఉమ్మడి ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుడిగా, తల్లి ద్వితీయ ఖాతాదారులుగా ఉండాలి.
- తల్లి లేకపోతే తండ్రిని ద్వితీయ ఖాతాదారుడిగా చేర్చవచ్చు. తల్లిదండ్రులు లేని పక్షంలో సంరక్షకుడిని ద్వితీయ ఖాతాదారుడిగా చేర్చవచ్చు.
- ఉమ్మడి ఖాతాకు డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యం ఉండరాదు. విద్యార్థి, తల్లి సంతకాల ద్వారా నగదు డ్రా చేసుకునేలా ఉండాలి.

ఉమ్మడి ఖాతా నుంచి వీరికి మినహాయింపు....

- విద్యా దీవెన లబ్ధిదారులైన ఎస్సీ విద్యార్థులు ఉమ్మడి ఖాతా ప్రారంభించాల్సిన అవసరం లేదు. అలాగే ఆయా కోర్సుల్లో 2022–23 చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఉమ్మడి ఖాతా అవసరం లేదు.

రేపు 'పురం'లో సామాజిక సాధికార యాత్ర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, పురం సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులు



హాజరైన ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు

- విజయవంతానికి ఎమ్మెల్యే శంకరనారాయణ పిలుపు
- బస్సుయాత్ర ఏర్పాట్లపై నేతలు, కార్యకర్తలతో సమావేశం

హిందూపురం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కలిగిన లబ్ధి, సంక్షేమ పథకాల వర్తింపు, పదవుల పంపకంలో కల్పించిన ప్రాధాన్యతను వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర ఈనెల 15వ తేదీ బుధవారం హిందూపురంలో సాగనుంది. సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. పలువురు మంత్రులు తరలిరానుండగా, బస్సుయాత్ర ఏర్పాట్లపై సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక అధ్యక్షతన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీ గోరంట్ల మాధవ్, యాత్ర పరిశీలకులు చంద్రహాస్, నియోజకవర్గనాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

మద్దతుగా నిలుద్దాం..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పాలనలో భాగస్వామ్యం చేసి అధికారం కట్టబెట్టిన సీఎం జగన్‌కు ఆయా వర్గాలన్నీ మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నాలుగున్నర ఏళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తూ... అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు, పదవులు అందించారని గుర్తుచేశారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత అంతాఇంతా కాదన్నారు. పార్టీ పదవులతోపాటు అన్ని సంక్షేమ పథకాలు మహిళకు పట్టం కట్టి 'జయహో జగనన్న' అనే రీతిలో పాలన సాగించారని కొనియాడారు. 15వ తేదీన నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి వార్డు, ప్రతి పల్లె నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జగనన్న అమలు చేస్తున్న సామాజిక న్యాయానికి మద్దతుగా నిలవాలని కోరారు.

విజయవంతం చేద్దాం..

నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికి జగనన్నపై అభిమానాన్ని మరోసారి చాటిచెబుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హిందూపురంతో పాటు మూడు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని బస్సుయాత్రను విజయవంత చేయాలని కోరారు. ఎంపీ మాధవ్ మాట్లాడుతూ..వైఎస్సార్ సీపీ హయాంలో ఎందరో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు జరిగిందని, వారంతా సామాజిక సాధికార యాత్రకు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందరం కలిసి జగనన్నకు మద్దతు తెలుపుతూ సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, పట్టణ కన్వీనర్లు సీఎం సాధిక్, నరేష్, మండల కన్వీనర్లు రాము, నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నాగభూషణం, జేసీఎస్ కన్వీనర్ మారుతిరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీ మాధవ్, టీఎస్ దీపిక, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, డీఎస్పీ కంజాక్షన్, పోలీసులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద బస్సుయాత్ర బహిరంగ సభకు చేయాల్సిన ఏర్పాట్లపై పరిశీలన చేశారు.

పల్లెకు పచ్చందాలు

ప్రత్యామ్నాయ పంటలకు ప్రాణం పోసిన వర్షాలు



గోరంట్ల వద్ద సాగులో ఉన్న ఉలవ పంట



కప్పలబండ వద్ద సాగులో ఉన్న వరి పంట

పుట్టపర్తి అర్బన్: పల్లె పల్లెనా పచ్చని పంటలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు ఖరీఫ్‌లో ఆలస్యంగా సాగుచేసిన కంది పంటతో పాటు రబీలో వేసిన ప్రత్యామ్నాయ పంటలకు ప్రాణం పోశాయి. జిల్లాలో కంది 5,840 హెక్టార్లలో సాగులో ఉండగా, అక్కడక్కడా పూత, పిందె దశలో ఉంది. తాజా వర్షాలతో దిగుబడి ఢోకా లేకపోవడంతో రైతు ఇంట ఆనందం నెలకొంది. అలాగే ఖరీఫ్‌లో పంటలు సాగు చేయని రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయడంతో ఉలవ, పెసర, శనగలు, అలసంద తదితర ప్రత్యామ్నాయ పంటలు వేశారు. ఇందులో ఉలవ 7,200 హెక్టార్లు, పెసర 100 హెక్టార్లకుపైగా సాగులో ఉంది. ఇక రొద్దం, రొళ్ల, సోమందేపల్లి, పెనుకొండ మండలాల రైతులు 2,300 హెక్టార్లలో శనగ సాగు చేశారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఈసారి రైతులు 4,680 హెక్టార్లలో వరి సాగు చేశారు. హైబ్రిడ్ రకం వరి దిగుబడులు బాగా పెరిగే అవకాశం ఉందని రైతులు ఆనందంగా చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలన్నీ కళకళ లాడుతున్నాయి. తుపాను ప్రభావంతో మరో నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతుండగా..రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





అఖండ భజనలో భక్తిగీతాలు ఆలపిస్తున్న మిర్‌పురి సంగీత కళాశాల బృందం, భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేస్తున్న దృశ్యం

సాయి నామం.. సత్యగానం

- గ్లోబల్ అఖండ భజనతో మార్మోగిన ప్రశాంతి నిలయం

ప్రశాంతి నిలయం: దేశ, విదేశాలకు చెందిన భక్తుల సత్యసాయి నామస్మరణతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. విశ్వశాంతి కాంక్షిస్తూ ప్రశాంతి నిలయంలో ఈనెల 11వ తేదీ (శనివారం) ప్రారంభించిన అఖండ భజన ఆదివారం సాయంత్రం మంగళహారతితో ముగిసింది. వేలాది మంది సత్యసాయి భక్తులు 24 గంటల పాటు సత్యసాయిని కీర్తిస్తూ, సేవలను కొనియాడుతూ భజనను కొనసాగించారు. విదేశీ భక్తులు సైతం సత్యసాయి కీర్తనలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అఖండ భజన ముగింపు సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాలు ఢీ - యువకుడి మృతి


అరబిందో పాల్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..బిహార్‌కు చెందిన అరబింద్‌పాల్ (29) పుట్టపర్తి సమీపంలోని సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన యజమాని సాయినాథ్ వద్ద ద్విచక్ర వాహనం ఇప్పించుకుని టపాసులు కొనుగోలు చేసేందుకు పుట్టపర్తికి బయలుదేరాడు. హారతి ఘాటు వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా మరో ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన అనిల్ (ఉత్తరప్రదేశ్) ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన అరబిందోపాల్ తలకు తీవ్ర గాయమైంది. పాల్‌తో పాటు బైక్‌పై ఉన్న రాయలవారిపల్లికి చెందిన రామ్మోహన్ స్థానికుల సాయంతో క్షతగాత్రుడిని సత్యసాయి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే అరబింద్‌పాల్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ఐదునెలల క్రితం ఆయనకు వివాహమైనట్లు సమాచారం. ఘటనపై సీఐ కొండారెడ్డి దర్యాప్తు చేపట్టారు.

ఆకస్మిక అలజడి

- అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో తనిఖీలు
- కోర్సు ప్రారంభమయ్యాక జేఎన్‌టీయూఏలో తొలిసారి
- అన్ని అంశాలపైనా క్షుణ్ణంగా పరిశీలన


జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలతో యాజమాన్యాల్లో అలజడి ప్రారంభమయ్యింది. 2023-24 విద్యా సంవత్సరం అనుబంధ గుర్తింపు దక్కించుకుని కోర్సులు ప్రారంభమైన తర్వాత వర్సిటీ యాజమాన్యం ఆకస్మిక తనిఖీలు చేస్తుండడంతో ఆందోళన మొదలైంది. విద్యార్థి, అధ్యాపక నిష్పత్తి, కళాశాలల్లో సదుపాయాలు, ల్యాబ్‌లో ప్రాక్టికల్స్‌లో కేటాయించిన మార్కులు తదితర అంశాలపై పరిశీలిస్తున్నారు. వర్సిటీ నిబంధనలకనుగుణంగా అధ్యాపకులకు వేతనాలు చెల్లిస్తున్నారా? లేదా అని ఆరాతీస్తున్నారు. ఆకస్మిక తనిఖీలతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కళాశాలల గుట్టు రట్టయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో జేఎన్‌టీయూఏ యాజమాన్య నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 90 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రధానంగా కంప్యూటర్ సైన్స్, దానికి అనుబంధంగా వచ్చిన కొత్త కోర్సు అంశంలోనే అధికారులు దృష్టి సారించారు. సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటెక్స్ వంటి కోర్సుల్లో అవసరమైన ప్రోగ్రామ్స్ ఉన్నాయా? మౌలిక సదుపాయాలు ఏ మేరకు ఉన్నాయి? అనే అంశాలను తనిఖీ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి.

బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వర్సిటీ తప్పనిసరి చేసినా, పలు కాలేజీలు దీన్ని అనుసరించలేదు. ఈ అంశాన్ని కూడా పరిశీలనలో భాగం చేయాలని నిర్ణయించారు. కాలేజీల్లో బోధించే సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా, వారి వ్యక్తిగత పాన్ కార్డుల ఆధారంగా ఆదాయ పన్ను శాఖ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

పక్కా సమాచారంతో తనిఖీలు..

బీటెక్ తరగతులు ఇప్పటికే ప్రారంభమయి నెలన్నర అవుతోంది. అనుబంధ గుర్తింపు దక్కించుకుని కోర్సులు ప్రారంభమయిన అనంతరం వర్సిటీ యాజమాన్యం పక్కా సమాచారంతో' ఆకస్మిక తనిఖీలు చేయడం ఆందోళనలకు కారణం. వాస్తవానికి ప్రతి ఏటా అనుబంధ హోదా గుర్తింపు జారీ చేస్తారు. అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే వర్సిటీ నిజనిర్ధారణ కమిటీని నియామకం చేసి కళాశాలలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ఆయా కళాశాలలోని ఇంజినీరింగ్ సీట్లు ఎన్ని కేటాయించాలి? గుర్తింపు ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై స్పష్టతకు వస్తారు. ఈ క్రమంలో 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభంకు ముందే జేఎన్‌టీయూ అనంతపురం నిజనిర్ధారణ కమిటీ నియామకం చేసింది. కళాశాలలను పరిశీలించి నివేదిక అందజేశారు. సీట్లు కేటాయింపు పూర్తయ్యింది.

అధ్యాపకులకు అత్తెసరు జీతాలు..

వర్సిటీకి చెందిన రెండు బృందాలను ఆకస్మిక తనిఖీల నిమిత్తం నియమించారు. అనుబంధ గుర్తింపు హోదా దరఖాస్తు సమయంలో పొందుపరిచిన అంశాలు, నిజ నిర్ధారణ కమిటీలు ఇచ్చిన నివేదిక మేరకు సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలిస్తున్నారు. విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులను నియామకం చేశారా? అధ్యాపకులకు వర్సిటీ నిబంధనల మేరకు జీతాలు, పీఎఫ్, చెల్లిస్తున్నారా? అనే అంశాలు పరిశీలిస్తున్నారు. అయితే సింహభాగం కళాశాలల్లో వర్సిటీ నిబంధలకు విరుద్ధంగా అత్తెసరు జీతాలు చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో వెలుగులోకొచ్చింది. ఉన్నత విద్యార్హతలు ఉన్నా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, చేతికి అందిస్తూ మ్యానువల్‌గా సంతకాలు చేయించుకుంటున్నారు. ఎంటెక్ పూర్తి చేసిన వారినే అధ్యాపకులుగా నియామకం చేయాల్సి ఉంది. కేవలం బీటెక్ అర్హతతోనే అధ్యాపకులుగా నియామకం చేసుకున్నట్లు బయటపడింది.

నాణ్యత ప్రమాణాల పెంపుదల తప్పనిసరి



వర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో అకడమిక్‌గా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యత ప్రమాణాలు పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ క్రమంలోనే ఇంజినీరింగ్ కళాశాల్లోని మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాలను పరిశీలిస్తున్నాం. తొలిసారిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. మభ్యపెట్టి అనుబంధ గుర్తింపు తెచ్చుకొని ఉంటే ఉపేక్షించబోం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

బాణాసంచా కాలుస్తుండగా ప్రమాదం


ఇంటిపై ఎగిసిపడుతున్న మంటలు

- రూ.లక్షల్లో ఆస్తి నష్టం
- బాధితుల కన్నీరు మున్నీరు

కదిరి టౌన్: దీపావళి వేడుకల్లో విషాదం నెలకొంది. బాణాసంచా కాలుస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో హార్మోనిస్టు కృష్ణమూర్తి ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. భారీగా నష్టం వాటిల్లినట్లు బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సోమవారం రాత్రి దీపావళి సందర్భంగా బాణాసంచా కాలుస్తుండగా ప్రమాదవశాత్తు కృష్ణమూర్తి ఇంట్లో నిప్పు అంటుకుంది. సమాచారంతో పట్టణ సీఐ నారాయణరెడ్డికి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వెంటనే అక్కడికి వచ్చి మంటలను అదుపుచేశారు. దాదాపు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల దాకా నష్టం జరిగినట్లు కృష్ణమూర్తి కుమారుడు చంద్రశేఖర్ వాపోయాడు. మిద్దెపైన దాదాపు1,000 పరుపులు, దూది, సోఫా సామాన్లు, ఫర్నీచర్ కాలిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని స్థానికులు కోరారు.

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: చిన్నారి కిడ్నాప్ కేసును గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. వివరాలను ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించారు. శనివారం రాత్రి పుట్టపర్తిలోని మోర్ సూపర్ బజార్ సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల వయసున్న బాలిక లక్షిత (5)ను చాక్లెట్లు, టపాసులు కొనిస్తానంటూ ఓ యువకుడు నమ్మించి అపహరించుకెళ్లాడు. పాప కనిపించకపోవడంతో చిన్నారి తల్లిదండ్రులు గిరినాయక్, అరుణబాయి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ వాసుదేవన్, సీఐ కొండారెడ్డి నేతృత్వంలో పోలీసులు బృందాలుగా సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా విడిపోయి స్థానిక యువకుల సాయంతో గాలింపు చేపట్టారు. పోలీసులు అప్రమత్తమైన విషయం తెలుసుకున్న యువకుడు చిన్నారిని ప్రశాంతి నిలయం సమీపంలో వదిలి ఉడాయించాడు. ఆదివారం తెల్లవారుజామున చిన్నారిని గుర్తించిన పోలీసులు సురక్షితంగా ఎస్పీ సమక్షంలో తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన విద్యార్థులు..

తప్పిపోయిన విద్యార్థులను ఆదివారం ఉదయం ఎస్పీ సమక్షంలో తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు. వివరాలను ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించారు. కదిరి, ఓడీచెరువు మండలం దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులు ఓడీచెరువులోని ఓ ప్రైవేట్ పాఠశాల వసతి గృహంలో ఉంటూ అక్కడే పదో తరగతి చదువుకుంటున్నారు. ఈ నెల 6న కటింగ్ చేయించుకుని వస్తామంటూ వార్డెన్‌తో అనుమతి తీసుకుని బయటకు వచ్చిన ఇద్దరు విద్యార్థులు సాయంత్రమైనా హాస్టల్‌కు చేరుకోలేదు. దీంతో అనుమానం వచ్చి పాఠశాల హెచ్ఎం రామకృష్ణ వెంటనే ఓడీచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. విద్యార్థులు బెంగుళూరులోని శివాజీనగర్‌లో ఉన్నట్లు గుర్తించి, అక్కడకెళ్లి పిలుచుకొచ్చారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి సమక్షంలో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారు.

గుడిబండలో గంజాయి సాగు కలకలం

- కర్ణాటక పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- నలుగురి అరెస్ట్... గంజాయి మొక్కల స్వాధీనం

మడకశిర: గుడిబండ మండలంలో గంజాయి సాగు కలకలం సృష్టించింది. మండలంలోని సీసీగిరిలో రైతు యంజారప్పకు చెందిన తోటలో సోమవారం ఉదయం కర్ణాటక ప్రాంత పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తోటలో అక్రమంగా సాగు చేసిన గంజాయి మొక్కలను గుర్తించారు. వివరాలు.. కర్ణాటకలోని పట్టనాయకనహళ్లి నివాసి తేజస్‌గౌడ్ రోజూ గంజాయి సేవించేవాడు. విషయం తెలుసుకున్న అక్కడి పోలీసులు తేజస్ గౌడ్ కదలికలపై నిఘా వేసి, రొళ్ల మండలం రత్నగిరికి చెందిన సన్నిహిత మిత్రుడు చంద్రశేఖర్‌తో కలసి గంజాయి సేవిస్తున్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలో వీరు గంజాయి కోసం రొళ్ల మండలం బీజీహట్టి గ్రామానికి చెందిన గొల్ల కరియన్న ద్వారా సీసీగిరిలోని యంజారప్పను సంప్రదించారు. తన తోటలో ఏడు గంజాయి చెట్లు ఉన్నట్లుగా యంజారప్ప తెలపడంతో తమకు గంజాయి ఆకును సరఫరా చేయాలని తేజస్‌గౌడ్, చంద్రశేఖర్ అభ్యర్థించారు. దీంతో మూడు చెట్లలోని ఆకులు కోసి కొన్ని రోజుల పాటు ఎండబెట్టి గొల్ల కరియన్నతో పాటు యంజారప్ప పట్టనాయకనహళ్లిలో ఉన్న తేజస్‌గౌడ్‌కు అందించేందుకు వెళ్లారు. అంతకు ముందే తేజస్‌గౌడ్‌పై నిఘా పెట్టిన కర్ణాటక పోలీసులు వెంటనే ముగ్గురినీ అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. యంజారప్ప తోటలోని గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇదే విషయాన్ని గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ సైతం నిర్ధారించారు. గంజాయి మొక్కల పెంపకానికి సంబంధించి యంజారప్పపై గుడిబండ పోలీసులు సైతం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


చిన్న అక్కులప్ప (ఫైల్)

బత్తలపల్లి: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లిలోని పాతూరుకు చెందిన నరసింహులు కుమారుడు చిన్న అక్కులప్ప (27)కు అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లకు చెందిన సునీతతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన చిక్క అక్కులప్ప రోజూ మత్తులో ఇంటికి చేరుకుని భార్యను కొట్టేవాడు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసుగు చెందిన ఆమె పిల్లలను పిలుచుకుని పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రాకపోతే చనిపోతానని బెదిరించడంతో ఆమె భయపడి భర్త వద్దకు చేరుకుంది. మూడు రోజుల క్రితం మళ్లీ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని చితక్కొట్టడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కాపురానికి రావాలని పదేపదే ప్రాధేయపడ్డాడు. అయినా ఆమె రాకపోవడంతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వేసిన తలుపులు వేసినట్టుగానే ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న అక్కులప్పను గుర్తించి, ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బాలల హక్కుల వారోత్సవాలు జయప్రదం చేయండి

పుట్టపర్తి అర్బన్: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14 నుంచి వారం రోజుల పాటు జరిగే బాలల హక్కుల వారోత్సవాలను జయప్రదం చేయాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని చిన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 15న ఆన్‌లైన్ సేఫ్టీపై యువతకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, 16న బాలబాలికలకు క్రీడాపోటీలు, 17న అన్ని మండలాల్లో యువతకు చిత్రలేఖన పోటీలు, 18న బాలబాలికల సంరక్షణపై ఆయా శాఖ పరిధిలో శిక్షణ, 19న మానవహారం, క్యాండిల్ ర్యాలీ, 20న అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం జరపనున్నట్లు వివరించారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకున్న విక్రాంత్, యశ్వంత్, అఫ్జల్, నందిని, యస్విత, లాస్యరెడ్డి ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ జమ్ముకాశ్మీర్ వేదికగా సాగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు తరలివెళ్లారు. ఈ మేరకు ఈ పాఠశాల పీడీ ప్రతాపరెడ్డి తెలిపారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రతి మండల శాఖాలోనూ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, సాహితీసాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్న అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది 70వ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు మంగళవారం అనంతపురంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 'భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర' అనే అంశం ఆధారంగా చర్చాగోష్ఠి నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు సహకార రంగం ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలు, సహకార పతాకం, అందిస్తున్న సేవలు, సహకార వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను చైతన్య పరుచే కార్యక్రమాలు ఉంటాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మడకశిర: స్థానిక 8వ వార్డుకు చెందిన శ్రీకాంత్(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగించే శ్రీకాంత్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడిన ఆయన ఓ గదిలోకి వెళ్లి కొడవలితో కుడివైపు పక్కన తల భాగాన్ని తనకు తానే నరుక్కున్నాడు. విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు, భార్య వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై సీఐ సురేష్‌బాబు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుప్తనిధుల ముఠా అరెస్ట్


ముఠా సభ్యుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ: గుప్తనిధుల ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్దనున్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్ఐ దిలీప్ కుమార్ వెల్లడించారు. మండలంలోని ఎల్లుట్ల గ్రామం ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన మాలేటి శ్రీనివాసులు కొన్ని రోజులుగా మదనపల్లెలో నివాసముంటూ బేల్దారిగా జీవనం సాగిస్తున్నాడు. మదనపల్లెకు చెందిన రచ్చా రవివర్మతో తమ ప్రాంతంలోని పురాతన ఆలయాలు, కొండల్లో గుప్తనిధుల ఉన్నాయని, ముఖ్యంగా ఎల్లుట్ల-నగరి పరిధిలో ఉన్న మూలలమ్మకొండల్లో పురాతన ఆలయాల దగ్గర పెద్ద మొత్తం నిధి నిక్షేపాలు ఉన్నాయని నమ్మించాడు. వాటిని వెలికి తీస్తే జీవితాంతం సుఖంగా బతుకవచ్చునని భావించిన ఇద్దరూ శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన సింకి భాస్కర్, కర్ణాటకలోని శ్రీనివాసపురానికి చెందిన మూరెళ్ల నాగరాజు, మదనపల్లెకు చెందిన అంబటి రెడ్డిసునీల్, వాల్మీకిపురానికి చెందిన ఇడగొట్టి రెడ్డెప్ప, బి.కొత్తకోటకు చెందిన వెన్నముద్దల మహేంద్రతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. పథకం ప్రకారం వీరందరూ ఈ నెల 10న నగరి సమీపంలోని మూలాలమ్మకొండపైకి చేరుకొన్నారు. రాత్రిళ్లు అక్కడే మకాం వేసి పూజలు చేస్తూ ఆలయ పరిసరాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ నెల 12న కొండపై నుంచి దిగి వస్తుండగా గ్రామస్తులు అనుమానం వచ్చి సమాచారం అందించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గుప్తనిధుల అంశం వెలుగు చూసింది. తవ్వకాలకు వినియోగించిన పరికరాలు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి, వాల్మీకిపురం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

వైభవంగా గుజరాతీల నూతన సంవత్సర వేడుకలు


అవతార పురుషుల నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు


మహాసమాధి చెంత చిన్నారులు

ప్రశాంతి నిలయం: గుజరాత్ నూతన సంవత్సర వేడుకలతో ప్రశాంతి నిలయంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా గుజరాతీలు ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించాయి. దాదాపు వెయ్యి మందికి పైగా గుజరాత్ సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి విచ్చేశారు. సత్యసాయి సన్నిధిలో సోమవారం సాయంత్రం తమ ప్రాంత నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా జరిపారు. గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాకు చెందిన సత్యసాయి విద్యానికేతన్ విద్యార్థులు, సూరత్‌కు చెందిన సత్యసాయి విద్యాలయ విద్యార్థులు మానవతా విలువలు, అవతార మూర్తుల విశిష్టతను వివరిస్తూ ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. చివరగా సత్యసాయి మహాసమాధి చెంత నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు.